క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట: పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా ఈ నెల 22న శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట, ఉప్పునుంతల, అమ్రాబాద్, పదర మండలాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి



కొల్లాపూర్: పంటలసాగులో డీఏపీకి బదులుగా కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని ఫర్టిలైజర్ దుకాణదారులకు ఏడీఏ జగ్గునాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని రైతువేదికలో ఫర్టిలైజర్ దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయక్ మాట్లాడుతూ డీఏపీ ఎరువుల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో దానికి ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులను వాడేవిధంగా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఓలు చిన్న హుస్సేన్‌యాదవ్, శిరీష, నాగజ్యోతి, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఐకేపీ ఏపీఎం మృతి

అమ్రాబాద్: అనారోగ్యంతో మండల ఐకేపీ ఏపీఎం గౌరారం రాంరెడ్డి(47) బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. వారం రోజుల నుంచి హైదరాబాద్ కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాంరెడ్డి మృతిపై ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాలు, అధికారులు సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్‌ఐ కల్యాణ్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలో చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో సేఫ్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీని నిర్వహించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ అందజేత



చారకొండ: మండలంలోని జూపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండటంతో వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు వాటర్ ప్లాంట్ సమకూర్చగా గురువారం గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. రూ.50 వేల విలువ చేసే మూడు వందల లీటర్ల సామర్థ్యం గల ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు. సాయి కుమార్, సిరాజ్, రవి తదితరులు ఉన్నారు.

చోరీ కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వెండి గొలుసు, కడియాలు చోరీకి గురైన ఘటన జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 18న జిల్లా కేంద్రానికి చెందిన ఇటిక్యాల కొండల్ తన తల్లిని ఇంట్లో ఉంచి బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఇల్లు కిరాయికి కావాలని వచ్చి వృద్ధురాలితో మాటలు కలిపి మత్తుమందు ఇచ్చారు. కొంత సమయానికి స్పృహ తప్పి కిందపడింది. 40 తులాల వెండి కడియాలు, 20 తులాల వెండి గొలుసులు అపహరించుకొని పరారయ్యారు. గురువారం ఇంటికి వచ్చిన ఇటిక్యాల కొండల్‌కు చోరీ విషయం తెలియడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమావేశానికి తరలిన మత్స్యకార్మికులు

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ నిర్వహించే మత్స్యకార్మిక మహాసభకు మండలంలోని మర్రికల్ గ్రామం నుంచి గురువారం మత్స్యకార్మికులు మోటార్‌సైకిళ్లపై తరలివెళ్లారు. మత్స్యకార్మికులు నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుట్ట రమేష్, కార్మికులు ఉన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం



అచ్చంపేటలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు



లింగాలలో



తెలకపల్లిలో కేక్‌కట్ చేస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను ఎగురవేశారు. పలుచోట్ల ర్యాలీలు చేపట్టారు.

■ మత్స్యకారుల అభ్యున్నతే అభివృద్ధే ధ్యేయమని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటయ్యముదిరాజ్ పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ సభకు వెళ్తున్న రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్‌ను మార్గమధ్యలో వెల్దండలో నాయకులు సన్మానించారు.

■ కొల్లాపూర్ పట్టణంలో తెనుగోళ్ల బెస్త సాంప్రదాయ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎం గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు.

■ మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ్మ అన్నారు. అచ్చంపేట ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ వద్ద ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవం నిర్వహించారు.

■ పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్టలో మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్స్యశాఖ మండల అధ్యక్షుడు డబ్బు గోవింద్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.

■ చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ముదిరాజ్ సంఘం కార్యాలయం ఆవరణంలో మత్స్యకారుల జెండా ఎగురవేశారు.

■ తెలకపల్లి మండల కేంద్రంలోని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం భవనంలో మత్స్యకార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణ కేక్‌కట్ చేశారు.

■ లింగాల మండల కేంద్రంలో కొత్త బస్టాండు పండుగ సాయన్న విగ్రహం దగ్గర మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షుడు కొండమోని సత్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అచ్చంపేట: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ ప్రజా భవన్‌లో గురువారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 150మందికి కల్యాణలక్ష్మి, 125 మందికి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చారకొండ: మండలంలోని అచ్చంపేట నియోజకవర్గ గ్రామాలకు సంబంధిత కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ 37 మంది కల్యాణలక్ష్మి, 18 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.



అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, ఆర్‌ఐ భరత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, ప్రశాంత్ నాయక్, జేసీబీ వెంకటయ్య, సహదేవ్, బాల్‌సింగ్, వెంకట్రాములు ఉన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

కొల్లాపూర్: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణం సమీపంలోని ఏకో పార్కులో చెత్తా, చెదారాన్ని అటవీ సిబ్బంది తొలగించారు. పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పార్కులో గల ప్లాస్టిక్ సామాగ్రి, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది ముజీబ్‌షొరీ, శివకుమార్, నీలేష్, బయ్యన్న, జయరాజ్, మల్లేష్, లక్ష్మయ్య, వెంకటయ్య, నాగార్జున్‌గౌడ్, లిఖిత తదితరులు ఉన్నారు.

బీమా బాండ్ల అందజేత

కొల్లాపూర్ అటవీరేంజ్ పరిధిలో పనిచేస్తున్న బేస్ క్యాంపు వాచర్లు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, డ్రైవర్లకు రాష్ట్రపతి కవచ్‌పాలసీ, వనసంరక్షణ్ సేవా సమితి ద్వారా రూ.10 లక్షల బీమా పాలసీ బాండ్లను ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ అందజేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి మేధాశక్తిని పెంచేందుకే ఆంగ్ల పదజాల పోటీలను నిర్వహిస్తున్నట్లు క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా జాన్సీలక్ష్మీబాయ్, ఇందిరాగాంధీ జయంతిలను పురస్కరించుకొని ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆంగ్ల పద్యాల పోటీలు, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించారు. ఆయా పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతల సహాయ సహకారాలతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసులు, పరమేశ్వర్‌ప్రసాద్, శ్రీనివాసాచారి, శరత్, మోహన్‌సాగర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన సాయిలు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. గురువారం ఆ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.3 వేలు, గ్రామ నాయకులు రూ.6 వేలు సమకూర్చి మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, తలసాని కృష్ణారెడ్డి, మల్లేష్, మదన్‌మోహన్ రావు, కంకల శ్రీశైలం, లింగం, భాస్కర్‌రెడ్డి, రాంరెడ్డి, కిషోర్, రమేష్, కృష్ణ తదితరులు ఉన్నారు.

జానపద నృత్య పోటీలో ప్రతిభ

కందనూలు: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జానపద నృత్య పోటీలలో పెద్దపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. గైడ్ టీచరుగా ఉపాధ్యాయుడు చాంద్‌బాషా వ్యవహరించారు. విద్యార్థినులను జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్, ఏఎంఓ ఎండీ షర్ఫుద్దీన్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మల్లేష్, ఉపాధ్యాయిని లలిత పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు



మాట్లాడుతున్న ఎంఈఓ శంకర్ నాయక్



మన్ననూర్‌లో..

కల్వకుర్తిరూరల్: చెకుముకి పోటీలతో సృజనాత్మత మెరుగు అవుతుందని ఎంఈఓ శంకర్ నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించి విజేతలతో సమావేశం అయ్యారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు విజయవంతం అయినట్లు జనవిజ్ఞాన వేదిక నియోజకవర్గ అధ్యక్షుడు మహమూద్ తెలిపారు. అంతకు ముందు ప్రశ్న పత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య విడుదల చేశారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పోటీల్లో కేకేరెడ్డి పాఠశాల, ఉన్నత పాఠశాల, బాలిక గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చారు.

లింగాల: ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన చెక్‌ముకి పోటీలలో ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ బషీర్ అహ్మద్ తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. తెలుగు మాధ్యమంలో పదవ తరగతికి చెందిన పి.సందీప్‌రాథోడ్, ఎస్.రాజేశ్వరి, ఏ.వాణీశ్రీ అదే విధంగా ఆంగ్ల మాధ్యమంలో ఎం.యశ్వంత్, కె.శివ, కె.స్వధన్‌దీప్‌రాథోడ్ ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు.

మన్ననూర్: సైన్స్‌పై అవగాహన కోసమే చెకుముకి పోటీలు నిర్వహిస్తునట్లు హెచ్‌ఎం సిద్దార్థ మహదేవ్ అన్నారు. గురువారం అమ్రాబాద్ మండల స్థాయి చెకుముకి పోటీలను మన్ననూర్‌లోని గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు.

డీటీఓకు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలని కోరుతూ గురువారం డీటీఓ బాలుకు ఏఐఎస్‌ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు స్కూల్ బస్సులను ఫిట్‌నెస్ లేకుండా ఇష్టానుసారంగా నడుపుతున్నారని, అర్హతలేని డ్రైవర్‌లను ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. బుధవారం బిజినేపల్లి మండలం వట్టెం వద్ద ఫిట్‌నెస్ లేని ప్రైవేటు స్కూల్ బస్సు వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లిందని విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నితిన్, ప్రసాద్, శివ, మారేడు శివ శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఫొటోలు పంపిణీ

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 22 మంది విద్యార్థులకు గురువారం యువకుడు సలీం ఉచితంగా ఫొటోలు అందజేశాడు. 2025 మార్చి నెలలో పదోతరగతి పరీక్షలు కోసం పాస్‌ఫొటోలు ఇవ్వాల్సి ఉంటుంది. పేద విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పాఠశాలకు వచ్చి విద్యార్థుల ఫొటోలు దించి మండల కేంద్రంలోని ల్యాబ్‌లో ప్రింట్ తీసుకొని ఉచితంగా అందజేశాడు. మూడేళ్లుగా పది పరీక్షలు రాసేందుకు మండల కేంద్రానికి వెళ్లెలా విద్యార్థులకు ఉచితంగా వాహనం సౌకర్యం, ప్యాడ్‌లు, పెన్నులు ఏర్పాటు చేస్తునట్లు యువకుడు సలీం తెలిపారు.

నిందితులకు రిమాండ్

తిమ్మాజిపేట: మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన అబ్దుల్‌ఖాన్‌కు సంబంధించిన పశువులను దొంగలించేందుకు కల్వకుంట తండాకు చెందిన ముడావత్ పీర్యా, పాత్లావత్ రవిలు గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపారు.

గ్రంథాలయ భవన పనులను పూర్తి చేయండి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు గురువారం కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు నాగమూరు మధు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గ్రంథాలయ పనులు ఏడాది కాలంగా నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులకు హైదరాబాద్‌లాంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్థికస్తోమత లేక చిన్నచిన్న రూమ్‌లు తీసుకొని ప్రిపరేషన్ అవుతున్నారని కావాల్సిన పుస్తకాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైన గ్రంథాలయ భవనానికి కృషి చేసి నోటిఫికేషన్‌లకు అవసరమయ్యే పుస్తకాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు శివరాం, నాయకులు నవీన్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌కు నివాళి

బిజినేపల్లి: మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సీవీ రామన్ వర్ధంతిని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయాలి

పెద్దకొత్తపల్లి: సకాలంలో సర్వే పూర్తి చేయాలని డిప్యూటీ సీఈఓ గోపాల్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై సూపర్‌వైజర్‌లతో సమావేశం అయ్యారు. దేవల్‌తిరుమలాపూర్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్, ఎంపీడీఓ నాగేందర్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని గ్రామాల్లో సమగ్ర సర్వేను గురువారం అమ్రాబాద్ ఎంపీడీఓ వెంకటయ్య క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి తదితర గ్రామాలలో ఆయన పర్యటించారు.



అమ్రాబాద్‌లో సర్వే చేస్తున్న అధికారులు

అమ్రాబాద్: సమగ్రకుటుంబ ఇంటింటి సర్వే మండలంలో 80 శాతం పూర్తైయ్యిందని ఎంపీడీఓ వెంకటయ్య తెలిపారు. అమ్రాబాద్‌తో పాటు జంగంరెడ్డిపల్లి, ఎల్మపల్లి, ఎమిరెడ్డిపల్లి తదితర గ్రామాలను ఆయన సందర్శించి సర్వేను పరిశీలించారు.

పశువుల సమగ్ర గణనకు సహకరించండి

తిమ్మాజిపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 21వ తేదీ నుంచి 28 తేదీ వరకు పశువుల సమగ్ర సమాచారం సేకరిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణి తెలిపారు. గురువారం మండలంలోని ఆవంచలో చేపట్టిన పశుగణన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వారం రోజుల పాటు పశుగణన కొనసాగుతోందని ఎన్యుమరేటర్లకు పశువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలపాలన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్క భక్తుడు రూ.1000 లు పైన చందా రూపంలో చెల్లించి శాశ్వత సభ్యుడుగా చేరాలని తీసుకున్న నిర్ణయానికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చిందని ఆలయం కమిటీ అధ్యక్షుడు పులిజాల శేఖర్, కార్యదర్శి బాలకృష్ణలు పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 45 మంది వరకు సభ్యులుగా చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, సురేష్, రామకృష్ణ, శేఖర్, రుక్మిణి మహిళా కమిటీ సభ్యులు జయమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న శ్రావణ్‌కుమార్



లింగాల: మండలంలోని అవుసలికుంటకు చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త శ్రావణ్‌కుమార్ డాక్టరేట్‌ను అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఓ కార్యక్రమంలో డాక్టరేట్ అవార్డు అందుకున్నట్లు అవార్డు గ్రహీత గురువారం తెలిపారు. బీఏ బీఈడీ, ఎంఏ తెలుగు పూర్తి చేసిన శ్రావణ్ 2014 నుంచి 2024 వరకు విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో ప్రస్తుతం 108 మంది విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలల్లో చదువుతున్నారు. చదువులు మధ్యలో ఆపివేసిన వారికి ప్రోత్సహిస్తూ ఓపెన్‌లో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చేర్పిస్తూ విద్యా దానాన్ని కొనసాగిస్తున్నాడు. దీనికి గాను ఫౌండేషన్ వారు అవార్డుతో పాటు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ ఇచ్చి ఘనంగా సన్మానించారు.

పొలంలో పంట అవశేషాలను కాల్చొద్దు



ఉప్పునుంతల: పొలంలో వేసిన పంటలు చేతికొచ్చిన తర్వాత వాటి అవశేషాలను కాల్చితే రైతులకు నష్టం కలుగుతుందని ఏఓ రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రం శివారులో రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట అవశేషాలను పొలంలో కల్చడం వలన కలిగే అనార్థాలపై రైతులకు అవగాహన కల్పించారు.. ఏఓతో పాటు ఏఈఓ మంజుల రైతులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: వరి కొయ్యలను కాల్చొద్దని ఏఈఓ అనిల్‌కుమార్ కోరారు. గురువారం గంట్రావ్‌పల్లిలో వరికొయ్యలపై అవగాహన కల్పించారు. పొలంలో కొయ్యలను కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఇంటర్నేషనల్ హ్యూమెన్‌రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్ర బాలు డిమాండ్ చేశారు. గురువారం సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శిర్సవాడలో సర్వే అధికారులతో కలిసి ఇంటింటా తిరిగి ఇల్లు లేక గుడిసెలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులను చూపించారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో పీఏసీఎస్ ద్వారా నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో ఆధ్వర్యంలో మండలంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500లు బోనస్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈఓ పాండు, ఏఈఓ శివానంద్, నాయకులు అచ్యుతారెడ్డి, మాధవులుగౌడ్, బంగారయ్య, రైతులు పాల్గొన్నారు.

కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

మండల కేంద్రంతో పాటు అంబట్‌పల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్లానాయక్ పరిశీలించారు. ఆయన వెంట సీఈఓ పాండు ఉన్నారు.

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు



కల్వకుర్తిరూరల్: నిబంధన మేరకే ధాన్యం కొనుగోలు చేస్తునట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, ఏఓ సురేష్ పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు తెచ్చిన ధాన్యాన్ని వారు పరిశీలించి తేమశాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీ భగవంతు, డైరెక్టర్ వెంకటయ్య, సీఈఓ వెంకటరెడ్డి, రైతులు లక్ష్మారెడ్డి, దామోదర్ రెడ్డి, శివయ్య, శంకర్ తదితరులు ఉన్నారు.

వరి ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి

పెద్దకొత్తపల్లి: రైతులు కోసిన వరి ధాన్యాన్ని 13 శాతం తేమ వచ్చే వరకు ఎండలో ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకురావాలని ఏఈఓ ముజీబ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని మార్చరీ యంత్రం ద్వారా పరిశీలించారు. కార్యక్రమంలో రాముడు, మల్లయ్య పాల్గొన్నారు.

ముగ్గురికి రిమాండ్

లింగాల: వ్యవసాయ పరికరాలలు చోరీ అయిన ఘటనలో గురువారం ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 16న మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన రైతు వెంకటయ్య పొలంలో 7 స్ప్రింక్లర్లను గోలగుండంకు చెందిన కడెం ఎల్లస్వామి, మాడాపూర్‌కు చెందిన మద్దెల వెంకటయ్య, చింత మల్లేష్‌లు చోరీ చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

మండలంలోని అంబట్‌పల్లి నుంచి లింగాల వైపు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడిన సంఘటనలో శ్రీశైలం అనే వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్లానాయక్ తెలిపారు. ఆటోలో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా గస్తీ తిరుగుతున్న పోలీసులు పట్టుకొని సమాచారం ఇచ్చారని డీటీ తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

కల్వకుర్తిరూరల్: పట్టణ సమీపంలోని ఆదర్శ నగర్ వెంచర్‌లో 2010 సంవత్సరంలో ప్లాట్లు కొనుగోలు చేశామని 14 సంవత్సరాల తరువాత ఆ వెంచర్ సమీపంలోని రైతు సుదర్శన్‌రెడ్డి ప్లాట్ల హద్దులను తొలగించారని బాధితులు గురువారం తహసీల్దార్ ఇబ్రహీంకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 267, 268, 300, 301 సర్వే నంబర్లలో చేసిన వెంచర్లలో తాము ప్లాట్లు కొన్నామని తెలిపారు. రైతు సుదర్శన్‌రెడ్డి కంచె వేశారని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన

లింగాల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగరాజు కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలకు గురైతే హెల్ప్‌లైన్ 1930, డయల్ 100ను ఉపయోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.